# సింగిల్ పేజీ కథలు

## వాత్సల్యం

''పున్నామ నరకం నుండి తండ్రిని రక్షించువాడు పుత్రుడు. వంశానికి మంచిపేరు తెచ్చి, తండ్రికి ఆనందాన్ని కలిగించేవాడే నిజమైన కుమారుడు. అలాంటి కొడుకు తండ్రికి ఒక్కడున్నా చాలు'' తెలుగు మాస్టారి మాటలు ఎదల్లో శిలాక్షరాళ్లా నిలబడిపోయాయి.

'నా తండ్రికి మంచిపేరు తెచ్చి ఆయన హృదయంలో మంచి స్థానాన్ని పొందగలిగితే చాలు. నా జన్మ సార్థకమైనట్లే' ఎప్పుడూ అనుకునేవాడు భార్గవశాస్త్రి.

★ ★ ★

అమ్మ ఎలా వుంటుందో తెలియకుండానే పెరిగాడు చంద్రశేఖర శాస్త్రి. తోటి పిల్లలంతా తల్లిని గురించి గొప్పగా చెప్పుకుంటూంటే ఎక్కడో మూలన కూర్చుని ఏడ్చేవాడు.

చంద్రశేఖర శాస్త్రి తండ్రి పౌరోహిత్యం చేసేవాడు. తల్లి గండాన పుట్టాడని కొడుకుపై ప్రేమ చూపలేకపోయాడు. అయిష్టంగానే కొడుకుని పదేళ్లపాటు పెంచాక కాలధర్మం చెందాడు. విధిలేని పరిస్థితుల్లో వారాలబ్బాయిగా మారాడు చంద్రశేఖర శాస్త్రి.

అందరితోనూ వినయ విధేయతలతో మెలిగేవాడు శాస్త్రి. చక్కగా చదువుకుంటూ పౌరోహిత్యం కూడా నేర్చుకున్నాడు. శాస్త్రి గుణగణాలను మెచ్చుకుని తన ఇంటి అల్లుడిగా చేసుకున్నాడు రామనాథశాస్త్రి.

రామనాథశాస్త్రి ఏకైక కుమార్తె గిరిజ. చంద్రశేఖరశాస్త్రికి అర్ధాంగిగా అన్ని విధాలా సరిపోయింది.

మామగారి తర్వాత పౌరోహిత్యాన్ని చేపట్టాడు చంద్రశేఖర శాస్త్రి. మామగారికంటే ఎక్కువగా మంచిపేరు సంపాదించుకున్నాడు. గిరిజ, చంద్రశేఖర శాస్త్రుల ముద్దుల కుమారుడే భార్గవశాస్త్రి.

★ ★ ★

''విద్యార్థి అంటే మీ భార్గవలా వుండాలండి'' చంద్రశేఖరశాస్త్రిని బడికి పిలిపించి గొప్పగా చెప్పాడు ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరు.

''ఆ వాడి మొఖం. వాడికేమి తెలుస్తుందండి. ఈమాత్రం దానికే గొప్పగా పొగుడుతున్నారుగానీ వీడికంటే తెలివైన వాళ్లు చాలామంది వున్నారు'' చులకనగా మాట్లాడేడు చంద్రశేఖర శాస్త్రి.

హెడ్మాస్టర్ మాటలతో విప్పారిన భార్గవ శాస్త్రి ముఖం, తండ్రి మాటలతో చిన్నబోయింది.



''నాన్నా! రన్నింగ్‌రేస్‌లో గెలుపొందా'' అంటూ సంతోషంగా కప్ తండ్రి చేతికందించాడు భార్గవశాస్త్రి.

''ఇదేదో ప్రపంచకప్ సాధించినంత గొప్పగా చెబుతున్నావే'' కొడుకు సంతోషంపై నీళ్లు చల్లాడు చంద్రశేఖర శాస్త్రి.

ఆటల్లోను, చదువులోను ఫస్ట్‌గా వుండేవాడు భార్గవశాస్త్రి. తల్లి ఎంతో ఆనందించేది. కానీ ఏనాడూ కొడుకును మెచ్చుకోలేదు చంద్రశేఖర శాస్త్రి.

'కొడుక్కి చదువు రాకపోయినా, చెడ్డపనులు చేస్తున్నా వెనకేసుకొచ్చి గొప్పగా చెప్పుకునే తండ్రులను చూశానుగాని నా తండ్రి లాంటివాడ్ని ఎక్కడా చూడలేదు. ఏనాడూ నన్ను మెచ్చుకున్న పాపాన పోలేదు. ఇలాంటి తండ్రి ఉన్నా లేకపోయినా ఒక్కటే. ఏం చేయాలి' తండ్రిపై కసిని పెంచుకున్నాడు భార్గవశాస్త్రి. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాడు.

ఆరోజు ఉగాది పర్వదినం. కష్టాలతో, కరువు కాటకాలతో, నిరాశతో చిత్రభాను సంవత్సరం కనుమరుగయింది. ఆంధ్రుల మనసుల్లో ఆశా వీణను మోగిస్తూ స్వభాను సంవత్సరం ఎలాంటి ఫలితాన్నిస్తుందో పంచాంగం ద్వారా వినిపించి ఇల్లు చేరాడు చంద్రశేఖర శాస్త్రి.

''ఊరందరి హితాన్ని కోరుతూ, మంచి పురోహితునిగా పేరు సంపాదించారు. అందరికి శకునం చెప్పే బల్లి, కుడితి తొట్టిలో పడి చచ్చిందన్నట్లు, మీ కన్నకొడుకు విషయంలో మాత్రం చాలా తప్పు చేస్తున్నారండి'' బాధతో పలికింది గిరిజమ్మ.

''ఏమిటీ! మన భార్గవుని విషయంలో నేను తప్పు చేస్తున్నానా. అలా ఎందుకనుకున్నావు గిరిజా!'' ఆశ్చర్యంగా అడిగాడు చంద్రశేఖర శాస్త్రి.

★ ★ ★

'నా తండ్రిని ఎంతో గొప్పగా ఊహించుకున్నాను. కాని అతనొక శాడిస్ట్. అలాంటి తండ్రి, కొడుక్కి శత్రువే. అందుకే నా తండ్రి ప్రాణాలు గంగలో కలిపేసి, ఏ నక్సలైట్‌గానో మారి అందరిపై పగతీర్చుకుంటా' అనుకుంటూ తండ్రి పడక గదివైపు వెళ్లాడు భార్గవశాస్త్రి. తల్లిదండ్రులు తన గురించే మాట్లాడుకుంటున్నారు. తలుపు దగ్గర్లో నిలబడి వారేం మాట్లాడుకుంటున్నారో జాగ్రత్తగా వినసాగేడు.

''మీ మెప్పు పొందాలని ఎంతో కష్టపడి అన్నింటిలోను ఫస్ట్‌గా వస్తుంటే మీరు మాత్రం చులకన చేసి మాట్లాడుతున్నారు. ఎన్నోసార్లు తన మనసులోని బాధను చెప్పుకుని ఏడ్చాడు. ఇలాగే జరిగితే మనసు విరిగిపోయి, ఏ రౌడీగానో తయారవుతాడు. అప్పుడు బాధపడి లాభం వుండదు'' ఏడుస్తూ అసలు సంగతి చెప్పింది గిరిజమ్మ.

''నీవు, భార్గవ నన్ను చాలా తప్పుగా అర్థం చేసుకున్నారు గిరిజా! నలుగురూ మనబ్బాయిని పొగుడుతూంటే కన్నతండ్రిగా నా మనసెంత సంతోషపడుతోందో, ఇలాంటి కొడుకును కన్నం

దుకు ఎంతగా నేను గర్విస్తున్నానో మీకు తెలుసా? ధనం, విద్య, గొప్ప వంశం, పొగడ్తలు అనేవి ఎవరికైనా అధికమైన గర్వాన్ని తెచ్చిపెడతాయి. వీటి మైకంలో పడి మనవాడు ఎక్కడ గర్వాంధుడవుతాడో, తప్పుదోవ పడతాడేమోనన్న భయంతోనే నేనిలా ప్రవర్తించాను. అబ్బాయి మనసు నొప్పించానన్న మాట. ఉదయమే విషయం చెప్పి భార్గవకు ఆనందాన్ని కలిగిస్తాను. నీవు పడుకో'' అంటూ ఆలోచనలో పడ్డాడు చంద్రశేఖర శాస్త్రి.

'నిజంగా నా భర్త ఎన్నటికీ నాకర్థం కాడేమో. ఆయనది లోతు గుండె' అనుకుంది గిరిజమ్మ.

భార్గవశాస్త్రి కళ్లకు కప్పిన పొర ఒక్కసారిగా కరిగిపోయింది. 'నా తండ్రి ఎంతటి గొప్పవాడు. ఇలాంటి ఉత్తముని చంపాలనా నేనాలోచించింది. పున్నామ నరకం నుండి రక్షిస్తానో లేదో కాని భరింపలేని పాపాన్ని మాత్రం మూటకట్టుకునే వాడినే. త్రుటిలో ఎంత ప్రమాదం తప్పింది. ఆయన పాదాలపై పడి క్షమాపణ వేడితేనేగాని నా మనసులోని ఆవేదన చల్లారదు' మెల్లగా తండ్రి దగ్గరకు చేరాడు భార్గవ శాస్త్రి.

తండ్రి పాదాలను వాటేసుకుని భోరున ఏడ్చాడు. ఏం జరిగిందో అర్థం కాక అయోమయంగా చూడసాగారు తల్లిదండ్రులు.

''మిమ్మల్ని అర్థం చేసుకోలేక చంపాలనే నిర్ణయానికొచ్చిన పాపాత్ముడ్ని నాన్నా. నా పాపానికి పరిహారం లేదు. నన్ను ఏడ్వనివ్వండి. నా కన్నీటితో మీ పాదాలను కడిగి నా మనోభారాన్ని తగ్గించుకుంటా'' పాదాలను వదలకుండా ఏడ్వసాగేడు భార్గవశాస్త్రి.


''నాయనా భార్గవా! ప్రాయశ్చిత్తాన్ని మించిన పాపపరిహారం లేదు బాబూ. నీ తప్పు తెలుసుకున్నావు. నీలో ఏ తప్పూ లేదు. వూరుకో'' అంటూ కొడుకును అనునయించాడు చంద్రశేఖర శాస్త్రి.

''బిడ్డల మనసు తల్లికి తెలిసినంతగా తండ్రి గ్రహించలేడంటారు. ఇది అక్షరాలా నిజం. భార్గవ మనస్తత్వాన్ని గిరిజ ఎంత బాగా అవగాహన చేసుకుంది. కాలం అనుకూలించింది కాబట్టి సరిపోయింది. లేకపోతే ఎంత అనర్థం జరిగి వుండేది. తల్లిదండ్రులు తమ బిడ్డలు గొప్పవారు కావాలని కోరుకుంటారేగాని, వాని మనోభావాలను కూడా అర్థం చేసుకుని ప్రవర్తిస్తే పిల్లల భవిష్యత్తు మహోన్నతంగా వుంటుంది. అలా కానినాడు ఎవరికైనా విపత్తు తప్పదు'' అనుకుంటూ ఆప్యాయంగా కొడుకును అక్కున చేర్చుకున్నాడు భార్గవశాస్త్రి.

**-టి.రామాంజనేయులు** (హాలహర్వి)

☆

# ప్రిస్క్రిప్షన్



''ఈ మందులు అర్జెంట్‌గా తీసుకుని వేయండి. నేను మరోచోట ఆపరేషన్‌కు వెళుతున్నాను'' అంటూ డాక్టర్ రవిచంద్ర ప్రిస్క్రిప్షన్‌ను గోవిందం చేతికి ఇచ్చి బయటకు వెళ్లిపోయాడు.

ప్రిస్క్రిప్షన్ చేత్తో పట్టుకుని బయటకు వచ్చి ఎదురుగా ఉన్న మెడికల్ షాపు వైపు అడుగులు వేయబోయి ఆగిపోయాడు. ఎదురుగా ఉన్న డాక్టర్‌గారి బావమరిది షాపు మూసేసి ఉంది. గోవిందం ఆలోచనలో పడ్డాడు.

'డాక్టర్ గారు అర్జెంట్‌గా మందులు తీసుకుని పాపకు వేయమన్నారు. తీరా చూస్తే షాపులేదు. వీటిని బయట కొనుక్కొని వద్దామంటే డాక్టర్‌గారు ఏమంటారో?'

ఏదైతే అయిందని పక్కవీధిలో ఉన్న మరో మెడికల్‌షాపునకు వెళ్లాడు. అక్కడ కౌంటర్‌లోని వ్యక్తికి ప్రిస్క్రిప్షన్ ఇచ్చాడు.

దాన్నతను పరీక్షగా చూసి ''పై మందులు లేవు మిగిలినవి ఇవ్వమంటారా?'' అడిగాడు.

మళ్లీ ఆలోచనల్లో పడ్డాడు. 'ఒకవేళ పై మందు దొరకని ఐటమ్ అయితే మిగిలిన షాప్ వాళ్ళు ఆ ఒక్క మెడిసిన్ ఇవ్వమంటే ఇవ్వకపోవచ్చు. మొత్తం మెడిసిన్స్ అన్నీ కొంటేనే ఆ మందు ఇస్తామనొచ్చు. అప్పుడేం చేయాలి?' అని మనసులో అనుకుని ''వద్దులెండి'' అంటూ ప్రిస్క్రిప్షన్ తిరిగి తీసుకుని మరో షాపువైపు వెళ్లాడు.

ప్రిస్క్రిప్షన్ అందుకున్న మరో షాపతను దీన్ని చదివి ''పైది అర్థం కావడం లేదండీ. పోనీ మిగిలినవి ఇచ్చెయ్యాలా?'' అడిగాడు. గోవిందం తల అడ్డంగా ఊపి మరో షాపు వైపు నడిచాడు.

ఇంకో షాపతను దాన్ని చూసి పై మందేమిటో అర్థంకాక జుట్టు పీక్కొని అక్కడున్న సీనియర్‌కి చూపించాడు. అతను దాన్ని చూసి జుట్టు పీక్కొని చొక్కా చింపేసుకున్నాడు. అతనికీ ఏం అర్థంకాక ''ఛ్ఛ..పై మెడిసిన్ ఏంటో అర్థంకావడం లేదండీ. డాక్టర్లు అటాచ్డ్ షాపువాళ్లకే అర్థమయ్యేలా కోడ్‌లో రాస్తారు. అక్కడే అడగండి'' అన్నాడు.

మెడిసిన్ అర్జెంట్ అనడంతో మిగిలిన షాపులన్నీ తిరిగాడు. వాళ్ళు పై భంగిమలతో పాటు వెర్రినవ్వు, పిచ్చి చూపు వంటి చేష్టలు చేశారు. కానీ ప్రిస్క్రిప్షన్‌పై మెడిసిన్ మాత్రం దొరకలేదు.

కాళ్ళీడ్చుకుంటూ నీరసంగా తిరిగి తన కూతుర్ని జాయిన్ చేసిన హాస్పిటల్‌కే తిరిగివచ్చాడు. ఎదురుగా తెరిచి ఉన్న షాపు చూడగానే ఆనందంతో పిచ్చికేక పెట్టి ఆషాపు వైపు పరుగెత్తాడు. షాపతను ప్రిస్క్రిప్షన్ చూసి పై వాళ్ళు చేసిన చేష్టలన్నీ చేసి కంటనీరు పెట్టుకుంటూ ''నాకేం అర్థంకావడంలేదు పదండి ఇప్పుడే డాక్టర్‌గారు వచ్చారు ఆయన్నే అడుగుదాం'' అన్నాడు. ఇద్దరూ డాక్టర్ దగ్గరకు వెళ్లి తమ బాధలు వెళ్లబోసుకున్నారు కన్నీళ్లతో.

రవిచంద్ర ప్రిస్క్రిప్షన్ చూసి పడీపడీ నవ్వి ఆనక నవ్వలేక పొట్టపట్టుకుని కళ్లనీళ్ళు పెట్టుకోసాగాడు. గోవిందం, షాపతను టీవీలో సీరియల్ ఎప్పుడు ముగుస్తుందో తెలియని ప్రేక్షకుల్లా వెర్రిముఖాలతో చూశారు ఆయన వైపు.

''ఏం లేదయ్యా పైది మీ పాప పేరు. మిగిలినవన్నీ మెడిసిన్స్. నేను చేసిన పొరపాటు ఏంటంటే పాప పేరు ముందు ఒకటి అంకె వేసి వరుసక్రమంలో మిగిలిన మెడిసిన్స్ రాశానంతే'' అన్నాడు రవిచంద్ర.

-కలపర్తి సత్యం ఏలూరు)

❏